12-09-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీరు సర్వ గుణాలలో 100 శాతం సంపన్నులుగా అవ్వాలి, నేను ఎంతవరకు పావనంగా అయ్యాను అని హృదయం రూపీ దర్పణములో చూసుకోవాలి"

ప్రశ్న:- పిల్లలైన మీరు ఏ ఉత్సవాన్ని రోజూ జరుపుకుంటారు మరియు మనుష్యులు ఏ ఉత్సవాన్ని జరుపుకుంటారు?

జవాబు:- మీరు దైవీ ధర్మ స్థాపన అనగా భారత్ ను స్వర్గముగా తయారుచేసే ఉత్సవాన్ని రోజూ జరుపుకుంటారు. రోజూ మీరు మనుష్యులను దేవతలుగా తయారుచేసే అంటును కట్టాలి. ఆ మనుష్యులైతే అడవిలోని ముళ్ళకు అంటు కడతారు మరియు దానికి వన మహోత్సవము అన్న పేరును పెడతారు. మీరు ముళ్ళను పుష్పాలుగా తయారుచేసే ఉత్సవాన్ని రోజూ జరుపుకుంటారు. మీరు జరుపుకునే లాంటి ఉత్సవాన్ని ఇంకెవ్వరూ జరుపుకోలేరు.

పాట:- ముఖాన్ని చూసుకో ఓ ప్రాణీ... (ముఖ్డా దేఖ్ లే ప్రాణీ...)

ఓం శాంతి. ఈ విధముగా ఎవరు అన్నారు? ఇక్కడ తండ్రి మరియు పిల్లల మిలనము సమ్ముఖముగా జరుగుతుంది. పిల్లలకు ఇప్పుడు చూడడం కోసమని దివ్య చక్షువు, జ్ఞానమనే మూడవ నేత్రము లభించాయి ఎందుకంటే ఇంతవరకు అందరూ పతితులుగా మరియు పాపాత్ములుగా ఉండేవారు. పతితులను పావనంగా తయారుచేసేందుకు తండ్రి శ్రీమతాన్ని ఇస్తారు. ఈ శ్రీమతాన్ని ఇచ్చేవారు ఎవరు, వారి గురించి కూడా అర్థం చేసుకోవాలి. వారే ఆత్మలకు చెప్తారు. నేను ఈ శరీరము ద్వారా మంచి కర్మలు చేసానా లేక చెడు కర్మలు చేసానా - అన్నది ఆత్మకు తెలుసు. బాబా పిల్లలైన మీకు వివేకాన్ని ఇస్తారు. అందరూ తప్పకుండా పతితులుగానే ఉన్నారు. మేము ఎంతవరకు పావనంగా అయ్యాము మరియు ఎంతవరకు దైవీ గుణాలను ధారణ చేసాము అని ఇప్పుడు మీరు చూడండి. దైవీ గుణాలను ధారణ చేయించేవారు సర్వ గుణాల సాగరుడైన తండ్రి, వారు కూర్చొని అర్థం చేయిస్తారు. నిర్గుణుడినైన నాలో ఏ గుణము లేదు అని మనుష్యులు పాడుతారు. మాలో ఏ గుణమూ లేదని వారు స్వయమే అంటారు. ఇప్పుడు పిల్లలైన మీరు మళ్ళీ 100 శాతం సర్వ గుణ సంపన్నులుగా అవ్వాలి. మీ హృదయం రూపీ దర్పణములో చూసుకోండి అని చెప్తారు. ఎప్పుడైతే సర్వ గుణ సంపన్నులుగా అవుతారో, అప్పుడే మీరు శ్రీ లక్ష్మి లేక శ్రీ నారాయణుడిని వరించగలుగుతారు. మొట్టమొదటైతే తండ్రి పరిచయాన్ని ఇవ్వాలి. ఇటువంటి అనంతమైన తండ్రి, ఎవరినైతే నీవే తల్లివి-తండ్రివి అని గానం చేస్తారో... ఆ పరమపితకు ఎంతో మహిమ ఉంది. శివాయ నమః అని అంటారు, వాస్తవానికి వారైతే స్వర్గ రచయిత. తప్పకుండా మనకు తండ్రి నుండి స్వర్గ వారసత్వాన్ని తీసుకునే హక్కు ఉంది. అనంతమైన తండ్రి ఇచ్చే వారసత్వము స్వర్గ రాజ్యాధికారము, వారు దానిని మనకు ఇస్తారు. భారత్ కు స్వర్గ రాజ్యాధికారము ఉండేది, అది ఇప్పుడు లేదు. తప్పకుండా అది తండ్రి నుండే లభించింది. భారత్ యే సత్యఖండముగా అవుతుంది. సత్యమైన శివబాబాకు ఇది జన్మస్థానము - ఇది ఎవ్వరికీ తెలియదు. శివరాత్రి మహిమ చేయబడుతుంది, అది ఏది? శ్రీకృష్ణుని రాత్రిని కూడా చూపిస్తారు మరియు శివుని రాత్రిని కూడా చూపిస్తారు. శ్రీకృష్ణుని జన్మ అయితే మాతృ గర్భం నుండి జరిగింది. శివబాబా విషయంలోనైతే వాస్తవానికి జన్మాష్టమి అని అనరు. ఎప్పుడైతే బ్రహ్మా రాత్రి ఏర్పడుతుందో అప్పుడే శివబాబా వస్తారు. రాత్రి తర్వాత పగలు వస్తుంది అనగా కలియుగాంతము మరియు సత్యయుగ ఆది జరుగుతుంది. దీనిని ఘోర అంధకారమయమైన రాత్రి అని అంటారు. ఇది అనంతమైన విషయము. హద్దులోని రాత్రి అయితే తప్పకుండా ఉంటుంది, కానీ కలియుగాంతాన్ని ఘోర అంధకారము అని అంటారు. జ్ఞానాంజనాన్ని సద్గురువు ఇచ్చారు... సద్గురువు అని జ్ఞాన సూర్యుడైన తండ్రినే అనడం జరుగుతుంది. మొట్టమొదటైతే తండ్రి మరియు వారసత్వపు పరిచయాన్ని ఇవ్వాలి. ఒకవేళ ఎవరైనా చక్రవర్తికి పిల్లలు లేకపోతే, ఎవరైనా పేద బిడ్డను దత్తత తీసుకుంటే, అప్పుడు ఆ బిడ్డకు మనస్సులో తెలుస్తుంది కదా - నేను పేదవాడిగా ఉండేవాడిని, ఇప్పుడు నేను చక్రవర్తికి కొడుకును అని. అలాగే మీకు కూడా తెలుసు, మేము రావణునికి చెందినవారిగా అవ్వడం ద్వారా చాలా పేదవారిగా అయ్యాము, ఇప్పుడు మేము అనంతమైన తండ్రికి చెందినవారిగా అయ్యాము, వారి నుండి మాకు స్వర్గ వారసత్వము లభిస్తుంది. ఈ పరిచయాన్ని చాలా బాగా ఇవ్వాలి మరియు వారి చేత వ్రాయించి తీసుకోవాలి - మాకు అనంతమైన తండ్రి నుండి అనంతమైన వారసత్వము లభిస్తుంది అని. ఈ జ్ఞానాన్ని ఇంకెవ్వరూ ఇవ్వలేరు. సన్యాసులైతే ఇళ్ళు-వాకిళ్ళను వదిలి వెళ్ళిపోతారు. వారు ఇక అమ్మ, నాన్న, చిన్నాన్న, మామయ్య మొదలైన సంబంధాలతో పిలిపించుకోవడం నుండి

పక్కకు వెళ్ళిపోయారు, అవన్నీ సమాప్తము. ఇక్కడైతే గృహస్థ ధర్మము యొక్క విషయం ఉంటుంది. వారేమో గృహస్థ ధర్మాన్ని త్యజిస్తారు.

పిల్లలైన మీకు తండ్రి అర్థం చేయిస్తారు - దేవీ-దేవతలైన మీరే గృహస్థ ధర్మములో ఉండేవారు, సర్వగుణ సంపన్నులుగా, సంపూర్ణ నిర్వికారీగా ఉండేవారు, అలాగే మీరు స్వర్గానికి అధిపతులుగా కూడా ఉండేవారు. తర్వాత మీరు పూజ్యుల నుండి పూజారులుగా అయి మీ పూజను కూడా మీరు చేసుకుంటారు. ఎప్పుడైతే మీరు పూజ్యులైన దేవీ-దేవతలుగా ఉండేవారో అప్పుడు మీకు అక్కడ పూజ చేయాల్సిన అవసరం ఉండదు. మామూలుగా అయితే భారత్ దేవీ-దేవతల పూజ్య కులముగా ఉండేది. ఇప్పుడు పూజ్యుల నుండి పూజారులుగా అయ్యారు. మళ్ళీ పిల్లలైన మీరు పూజారుల నుండి పూజ్య దేవీ-దేవతలుగా అవ్వాలి, అందుకే మీరే పూజ్యులు, మీరే పూజారులు అని గాయనం చేయబడుతుంది. తండ్రి పూజ్యునిగా మరియు పూజారిగా అవ్వరు. తండ్రి అయితే సదా పూజ్యునిగానే ఉంటారు. భక్తి మార్గంలో బ్రాహ్మణులు మందిరంలో శివలింగాన్ని పెడతారు, తర్వాత కూర్చొని తండ్రిని పూజిస్తారు. మనము వారి పిల్లలము. ఓ పరమపిత పరమాత్మా! అని అంటారు కదా. వారు నిరాకారుడు, ఆత్మ కూడా నిరాకారియే. శివుని వద్దకు వెళ్ళినప్పుడు పరమపిత పరమాత్మ నిరాకార శివుడు అని అంటారు. ఈ మాట ఆత్మయే ఇంద్రియాల ద్వారా అంటుంది. ఇప్పుడు పిల్లలైన మీరు ఇది కూడా తెలుసుకున్నారు - ఎవరైతే మంచి కర్తవ్యాలు చేసి వెళ్తారో వారి మహిమ చేయడం జరుగుతుంది. ఇప్పుడు మీరు మాత, పిత అని ఆ నిరాకారుడినే అంటారు. మీ సహజ రాజయోగము మరియు జ్ఞాన శిక్షణ ద్వారా మేము అపారమైన సుఖాన్ని పొందుతాము అని అంటారు. దాని కొరకు మీరు పురుషార్థం చేస్తున్నారు. ఇది ఎంత సహజమైన విషయము. మీరు ప్రాక్టికల్ గా ప్రజాపిత బ్రహ్మకు పిల్లలుగా, బి.కె.లుగా ఉన్నారు, సమ్ముఖములో కూర్చున్నారు. శివబాబా మరియు బ్రహ్మాబాబా, ఇరువురికీ సమ్ముఖములో ఉన్నారు. శివబాబాకు తమ శరీరమైతే లేదు. శివబాబా వీరి ముఖము ద్వారా రాజయోగాన్ని నేర్పిస్తున్నారని మీకు తెలుసు. శ్రీకృష్ణుడు అయితే చిన్న బాలుడు. దేహ సహితముగా దేహపు సర్వ సంబంధాలను మరవండి, స్వయాన్ని ఆత్మగా భావించండి అని అతను ఎలా చెప్పగలడు? శ్రీకృష్ణుడైతే ఈ విధంగా అనలేరు. ఈ విధంగా తండ్రియే అనగలరు. కావున అది చాలా పెద్ద పొరపాటు అయినట్లే కదా. లక్ష్మీ-నారాయణులకు నుండి మొదలుకుని యథా రాజా రాణి, తథా ప్రజా... వారందరికీ సుఖము లభించింది. వారందరే 84 జన్మలు తీసుకొని తమోప్రధానులుగా అయ్యారు. ముఖ్యమైనవారు లక్ష్మీ-నారాయణులే అయినట్లు కదా. ఆ తర్వాత యథా రాజా రాణి, తథా ప్రజా. ఇప్పుడు మీరు వచ్చి మళ్ళీ శూద్రుల నుండి బ్రాహ్మణులుగా అయ్యారు. ఇది మీ లీప్ (అధిక) జన్మ. లీప్ జన్మ అని ధర్మపరమైన జన్మను అంటారు. ఇది మన ఈశ్వరీయ జన్మ అని మీకు తెలుసు.

రోజురోజుకు బాబా కొత్త-కొత్త పాయింట్లను అర్థం చేయిస్తూ ఉంటారు. ఎప్పటివరకైతే జీవిస్తారో అప్పటివరకూ, అంతిమం వరకూ మీరు చదవాలి. పాయింట్లు వెలువడుతూ ఉంటాయి, పాయింట్లు యాడ్ అవుతూ (కలుస్తూ) కూడా ఉంటాయి. జ్ఞాన యజ్ఞము కూడా అంతిమం వరకూ కొనసాగనున్నది. రుద్ర యజ్ఞాన్ని రచిస్తారు, మట్టితో సాలిగ్రామాలను తయారుచేసి కూర్చుని వాటిని పూజిస్తారు. ఆత్మకు పూజ జరుగుతుంది. జీవాత్మలైన మీరే భారత్ ను శిరోకిరీటముగా చేసారు, కావున ఆత్మల పూజ చేస్తారు. పరమపిత పరమాత్మ అయిన తండ్రితోపాటు మీరు కూడా సేవ చేస్తున్నారు, అందుకే శివలింగంతోపాటు సాలిగ్రామాలను కూడా తయారుచేస్తారు. కావున ముఖ్యంగా మొట్టమొదట తండ్రి పరిచయాన్ని ఇవ్వాలి. శివబాబా జన్మ తీసుకున్నారు కానీ తల్లి గర్భము నుండేమైనా జన్మ తీసుకుంటారా. వారు నిరాకారుడు.

ఏ విధంగానైతే ఎవరైనా శరీరాన్ని వదిలినప్పుడు శ్రాద్ధము తినేందుకు వారి ఆత్మను పిలుస్తారు, అప్పుడు ఆ ఆత్మకే తినిపిస్తారు కదా, ఆత్మయే రుచి చూస్తుంది. చేదు, తీపి, సుఖము, దుఃఖము, ఇవన్నీ ఆత్మకే అనుభవమవుతాయి. ఆత్మలోనే సంస్కారాలు ఉన్నాయి. ఎప్పుడైతే శరీరము ఉంటుందో, అప్పుడే ఆత్మకు సుఖ-దుఃఖాలు అనుభవమవుతాయి. శిక్షలు ఎలా లభిస్తాయి అనేది బాబా అర్థం చేయిస్తారు. సూక్ష్మ శరీరము కూడా కాదు, స్థూల శరీరాన్ని ధారణ చేయించి శిక్షలు ఇస్తారు, గర్భ జైలులో శిక్షలు అనుభవిస్తారు. ఆర్తనాదాలు చేస్తారు. ఇక చాలు, నన్ను బయటకు తీయండి అని అంటారు. గర్భ మహలు ఉదాహరణ కూడా ఇవ్వడం జరిగింది. ఆ ఉదాహరణలో వారికి బయటకు రావాలని అనిపించదు. ఇది ఒక ఉదాహరణ. సత్యయుగములో గర్భము కూడా మహలుగా ఉంటుంది. అక్కడ పాపము ఏమీ జరగదు.

పతితులుగా ఎలా అయ్యారు అనేది ఇప్పుడు మీకు తెలుసు. పేరే అజామిళ్ వంటి పతితులు అని ఉంది. ఎన్నో

పాపాలు చేస్తారు. పావనులు అనగా నిర్వికారులు. ముఖ్యమైన విషయమే వికారాలది, కావున పావనులుగా అయ్యేందుకు సన్యాసులు ఇళ్ళు-వాకిళ్ళను వదిలేస్తారు, అందుకే వారిని మహాత్ములు అని అంటారు. మనుష్యులందరూ పతితులే, అందుకే పతితపావన సీతారామ్, రఘుపతి రాఘవ రాజారామ్... అని పాడుతూ ఉంటారు. వాస్తవానికి రాజారామ్ అని శివబాబానైతే అనరు. రాముడు అని పరమపిత పరమాత్మనే అంటారు కానీ రాజా రామ్ అని అనరు. నేనేమీ రాజుగా, మహారాజుగా అవ్వను. మహారాణి అయిన శ్రీలక్ష్మిగా, మహారాజు అయిన నారాయణునిగా మీరే అవుతారు, నేను కాదు. నేనైతే నిరాకారుడిని, పునర్జన్మ రహితుడిని. శరీరధారులు ఎవరెవరైతే ఉన్నారో, వారంతా పునర్జన్మలు తీసుకుంటూ ఉంటారు. తండ్రి అంటారు, నేను నిరాకారుడిని. నేను కూడా ప్రకృతిని ఆధారంగా తీసుకోవాల్సి ఉంటుంది. నేను గర్భంలోకి ప్రవేశించను, నేను వీరిలోకి ప్రవేశిస్తాను, వీరికి వీరి జన్మల గురించి తెలియదు.

తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు - మీరే దేవీ-దేవతలుగా ఉండేవారు, ఆ తర్వాత శూద్రులుగా అయ్యారు, ఇప్పుడు మీరే బ్రాహ్మణులుగా అయ్యారు. నేను మీకు అర్థం చేయిస్తాను. మీకు మీ జన్మల గురించి తెలియదు. ఎవరైతే బ్రాహ్మణులుగా అవుతారో, వారే వచ్చి అర్థం చేసుకుంటారు. తండ్రి అంటారు, ఈ విధంగా మీరు 84 జన్మలను పూర్తి చేసారు. 21 తరాల వారసత్వం అని అంటారు. అనంతమైన తండ్రి అనంతమైన సుఖ వారసత్వాన్నే ఇస్తారు కదా. లౌకిక తండ్రి నుండైతే అల్పకాలికమైన సుఖము లభిస్తుంది. అమరలోకంలో ఆదిమధ్యాంతాలు సుఖము ఉంటుంది. ఇక్కడ ఆదిమధ్యాంతాలు దుఃఖము ఉంది. పార్వతులైన మీకు అమరనాథుడైన శివబాబా అమరకథను వినిపిస్తారు. వారు సత్యనారాయణ కథను కూడా వినిపిస్తారు. ఇది జ్ఞానమనే మూడవ నేత్రాన్ని ఇచ్చే కథ. భారతవాసులు సదా సుఖంగా ఉండేవారు, ఎంతో పవిత్రంగా ఉండేవారు. పవిత్రత, ఆరోగ్యము, ఐశ్వర్యము ఉండేవి. ఎప్పుడూ ఎవ్వరూ రోగగ్రస్థులుగా అయ్యేవారు కాదు. దాని పేరే స్వర్గము. భారత్ ప్రాచీన స్వర్గంగా ఉండేది, ఇంకే ధర్మము లేక ఖండము అక్కడ ఉండేవి కావు. వృక్షము యొక్క కాండమైతే ఉంటుంది కదా. కాండములో ఎవరు ఉండేవారు? తప్పకుండా దేవీ-దేవతల చిత్రాలు ఉన్నాయి. అదే పునాది. కానీ స్వయాన్ని దేవీ-దేవతా ధర్మానికి చెందినవారిగా పిలుచుకోరు. ఇప్పుడు వారి రాజధాని స్థాపన అవుతోంది. మీరు సత్యయుగంలోని రాధే-కృష్ణులు జంటగా అవ్వవచ్చు. మీరు నిజంగా స్వర్గానికి యువరాజుగా ఎలా అవ్వగలరు అనేది మీరు వస్తే మేము మీకు అర్థం చేయిస్తాము అని మీరు చెప్పవచ్చు! ఈ సమయంలోనైతే అందరూ పతితులుగా ఉన్నారు, ఏదైనా యుక్తితో వ్రాయవచ్చు. అన్ని ధర్మాలు కలిసి ఒకటైపోవాలి అని అంటారు. కానీ అది ఎలా జరగగలదు? ఒకే ధర్మము అనేది సత్యయుగములోనే ఉండేది, ఒకే మతము, ఒకే భాష ఉండేవి. అక్కడ చప్పట్లు మ్రోగేవి కావు. విశ్వాధిపతులుగా ఉండేవారు, ఇంకే ధర్మమూ ఉండేది కాదు. వారు అలా ఎలా అయ్యారు, ఆ తర్వాత ఇతర ధర్మాలు ఎలా వచ్చాయి - ఈ విషయాలలో ఎవ్వరూ బుద్ధిని ఉపయోగించరు. ఎప్పుడైతే పూర్తిగా పతితులుగా అయిపోతారో, అప్పుడే పతిత-పావనుడైన తండ్రి వస్తారు. ఇతర ధర్మాల పావన ఆత్మలు పై నుండి వస్తాయి. మొదట ధర్మ స్థాపకులు తాము స్వయం వస్తారు, ఆ తర్వాత ‘రండి’ అని వారి వెనుక ఇతరులను పిలుస్తారు. వారైతే సతో, రజో, తమోలలోకి వస్తారు. ఎవరెవరైతే వస్తారో, వారందరూ సతో, రజో, ఆ తర్వాత తమోగా అవ్వవలసిందే. కానీ ఇప్పుడు మీరు పతితుల నుండి పావనులుగా అవుతారు. అందరూ పిలుస్తారు - గాడ్ ఫాదర్, రండి, వచ్చి మమ్మల్ని స్వర్గంలోకి తీసుకువెళ్ళండి. స్వర్గమని - కొందరు ముక్తిని, కొందరు జీవన్ముక్తిని భావిస్తారు. స్వర్గమని జీవన్ముక్తినే అంటారని మీరు అర్థం చేసుకుంటారు. మీ అంటు కట్టబడుతోంది. అక్కడ వారు అడవి ముళ్లకు అంటు కడుతున్నారు. రాత్రికి, పగలుకు ఉన్నంత తేడా ఉంది. దానికి కూడా ఉత్సవాన్ని జరుపుతారు. వన మహోత్సవాన్ని, వృక్షాలు పెంచేందుకు ఉత్సవాన్ని జరుపుతారు. మీరు దైవీ ధర్మ స్థాపన అనగా భారత్ ను స్వర్గముగా తయారుచేసే ఉత్సవాన్ని రోజు జరుపుతారు. రోజు మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేసే పురుషార్థము చేస్తారు. ముళ్ళను పుష్పాలుగా తయారుచేయడం - ఇది మీరు రోజు చేసుకునే ఉత్సవము. మరి ఆ తోటమాలి తప్పకుండా అంతటి బహుమతిని కూడా ఇస్తారు.

పిల్లలు పాటను విన్నారు - ఓ ప్రాణీ, నీ హృదయమనే దర్పణంలో చూసుకో, నీవు స్వర్గములోని దేవీ-దేవతగా అయ్యేందుకు లేక లక్ష్మిని వరించేందుకు అర్హునిగా అయ్యావా? అవగుణాలు ఏవీ లేవు కదా? తుఫానులైతే ఎన్నో వస్తాయి. మాయ ఎవ్వరినీ విడిచిపెట్టదు. పెద్ద-పెద్ద దీపాలను కూడా ఆర్పివేస్తుంది. తప్పుడు సంకల్పాలైతే ఎంతగానో దాడి చేస్తాయి. కానీ దృఢంగా ఉండాలి. ఇందులో వాడిపోయే విషయమేదీ లేదు. తండ్రితో యోగాన్ని తెంచకూడదు. అందరికీ నావికుడు ఈ తండ్రి. ఇది విషయ-వైతరిణీ అనే పెద్ద కాలువ, దీనిని మీరు యోగబలంతో దాటుతారు. విషయ సాగరం నుండి దాటి మీరు క్షీరసాగరంలోకి వెళ్ళిపోతారు. విష్ణువు రాజ్యము క్షీరసాగరంలో ఉంది అనగా అక్కడ నేతి

నదులు ప్రవహిస్తాయి. ఇక్కడ కిరోసిన్ మరియు రక్తపు నదులు ప్రవహిస్తాయి.

శివబాబా శ్రీమతం ద్వారా మనం శివాలయంలోకి వెళ్తున్నామని పిల్లలైన మీకు తెలుసు. అక్కడ మనం సదా సుఖంగా ఉంటాము. మీరు సదా సుఖంగా ఉండేవారు, మాయ దుఃఖితులుగా చేసింది. గృహస్థ వ్యవహారాన్ని అధర్మయుక్తంగా చేసింది. అక్కడ ధర్మయుక్తమైన గృహస్థ వ్యవహారము ఉండేది. ఇప్పుడు మిమ్మల్ని తండ్రి శ్రేష్ఠాచారులుగా, దైవీ గృహస్థ ధర్మంవారిగా తయారుచేస్తున్నారు. మొట్టమొదట ముఖ్యమైనది తండ్రి పరిచయము. మీరు తండ్రికి చెందినవారిగా అవ్వడం ద్వారా స్వర్గాధిపతులుగా అవ్వగలుగుతారు. ఇది దుఃఖధామము. మీరు వయా ముక్తిధామం స్వర్గంలోకి వెళ్తారు, అందుకే శివపురిని, విష్ణుపురిని స్మృతి చేయండి. స్మృతి చేస్తూ-చేస్తూ అంతిమ మతిని బట్టి గతి ఏర్పడుతుంది. మా 84 జన్మలు పూర్తయ్యాయి, మళ్ళీ మేము రేపు వచ్చి రాజ్యం చేస్తాము అని గుర్తుంచుకోండి. నాలో ఏ అవగుణమూ లేదు కదా అని హృదయమనే దర్పణంలో మీ ముఖాన్ని చూసుకుంటూ ఉండండి? అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. యోగబలం ద్వారా విషయ వైతరిణీ అనే పెద్ద కాలువను దాటాలి. తప్పుడు సంకల్పాలలో వాడిపోకూడదు. దృఢంగా ఉండాలి.

2. పూజ్యనీయులుగా అయ్యేందుకు తండ్రితో కలిసి భారత్ ను శిరోకిరీటముగా తయారుచేసే సేవను చేయాలి.

వరదానము:- ట్రస్టీగా అయ్యి లౌకిక బాధ్యతలను సంభాళిస్తూ కూడా అలసట లేనివారిగా ఉండే డబుల్ లైట్ భవ

లౌకిక బాధ్యతలను సంభాళిస్తూ సేవ యొక్క బాధ్యతను కూడా సంభాళించటము, దీనికి డబుల్ లాభము లభిస్తుంది. డబుల్ బాధ్యతలైనట్లయితే డబుల్ ప్రాప్తి ఉంటుంది. కానీ డబుల్ బాధ్యతలు ఉన్నా కూడా డబుల్ లైట్ గా ఉండేందుకు స్వయాన్ని ట్రస్టీగా భావించి బాధ్యతలను సంభాళించినట్లయితే అలసట అనుభవము కాదు. ఎవరైతే - నా గృహస్థము, నా ప్రవృత్తి అని భావిస్తారో, వారికి భారము అనుభవమవుతుంది. నా అనేదే లేనప్పుడు ఇక భారము ఏ విషయములో ఉంటుంది.

స్లోగన్:- సదా జ్ఞాన సూర్యుని సమ్ముఖములో ఉన్నట్లయితే భాగ్యము రూపీ నీడ మీతో పాటు ఉంటుంది.